
మెదడుకు మేత.. చక్కటి భవిత





నేటి నుంచి గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాలు

కథలు.. కథనాలు.. సృజనాత్మక కృత్యాలు

పుస్తక పఠనం.. సమీక్షలు.. భావవ్యక్తీకరణ అంశాలు

ముగింపు రోజున మెరిట్ సర్టిఫికెట్ల అందజేత

దాబాగార్డెన్స్: గ్రంథాలయాల్లో ఈ నెల 28 నుంచి పాఠశాల విద్యార్థులకు సమ్మర్ ఓరియంటేషన్ కార్యక్రమం జూన్ 6 వరకు నిర్వహించనున్నారు. ఈ మేరకు జిల్లాలో గల అన్ని శాఖా గ్రంథాలయ నిర్వాహకులకు జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఆర్‌సీహెచ్ వెంకట్రావు సూచనలు జారీ చేశారు.

40 రోజుల ప్లాన్..

వేసవి శిక్షణ శిబిరాలు ఈ నెల 28 నుంచి జూన్ 6 వరకు నిర్వహించనున్నారు. ప్రతి రోజూ ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఉంటుంది. శిబిరాల్లో విద్యార్థులచే కథలు, క్విజ్, జనరల్ నాలెడ్జి (జీకే) పుస్తకాలు చదివించడం, చిత్రలేఖనం, 2047 స్వర్ణాంధ్రప్రదేశ్.. స్వచ్ఛాంధ్రప్రదేశ్ వంటి విజ్ఞానదాయక కార్యక్రమాలు.. కథలు వినడం.. గ్రంథాలయాల్లో గల పుస్తకాలు చదవడం.. చదివిన పుస్తకాలపై సమీక్ష.. కథలు చెప్పడం.. స్పోకెన్ ఇంగ్లీషు.. డ్రాయింగ్.. పెయింటింగ్.. క్రాఫ్ట్.. డ్యాన్స్.. అతిథుల ప్రసంగాలు.. డ్రామా.. బొమ్మలు తయారు చేయడం.. ఇతర అంశాలపై కార్యక్రమాలు ఉంటాయి.



ముస్తాబైన జిల్లా కేంద్ర గ్రంథాలయం



వేసవి శిబిరాలకు సిద్ధమైన బాలల శాఖా గ్రంథాలయం

ఒక వారం చదివిన తర్వాత ప్రతి వారం ముగింపు వ్యక్తీకరణ సెషన్‌లు, వారి పఠన అనుభవాలు పంచుకోవడం, పుస్తక సమీక్ష, కథ చెప్పడం, కథలు రాయడం వంటివి ఏర్పాటు. పదవీ విరమణ చేసిన ఉపాధ్యాయులు, లెక్చరర్లు, విద్యావేత్తలను ఈ కార్యక్రమాలకు న్యాయ నిర్ణేతలుగా ఆహ్వానిస్తారు. సమ్మర్ ఓరియంటేషన్ కార్యక్రమం ముగింపు రోజున (జూన్ 6) విద్యార్థులు నేర్చుకున్న అంశాల అనుభవాలను తల్లిదండ్రుల సమక్షంలో ప్రదర్శించడం. వేసవి శిబిరంలో పాల్గొన్న విద్యార్థులకు ప్రముఖులచే మెరిట్ సర్టిఫికెట్లు అందజేస్తారు.

బాలల శాఖా గ్రంథాలయంలో..

జీవీఎంసీ 36వ వార్డు రంగిరీజువీధిలో గల బాలల శాఖా గ్రంథాలయంలో ప్రత్యేక వేసవి శిబిరాలు నిర్వహించనున్నట్టు గ్రంథాలయ అధికారి టి. పోలితల్లి తెలిపారు. ఉదయం 8 నుంచి 8.30 గంటల వరకు కథలు వినడం, 8.30 నుంచి 10 గంటల వరకు పుస్తకాలు చదవడం, 10 నుంచి 10.10 వరకు విరామం, 10.10 నుంచి 10.30 వరకు పుస్తక కమీక్ష, 10.30 నుంచి 11 గంటల వరకు కథలు చెప్పడం, 11 నుంచి 12 గంటల వరకు స్పోకెన్ ఇంగ్లీషు, డ్రాయింగ్, పెయింటింగ్, పేపర్ క్రాఫ్ట్, డ్యాన్స్, పప్పెట్ మేకింగ్, చెస్, క్యారమ్స్, క్విజ్, జీకే వంటి కార్యక్రమాలు ఉంటాయన్నారు.

కార్యక్రమ లక్ష్యాలు..

- పిల్లలు సెలవులను సక్రమంగా వినియోగించుకోవాలి
- పిల్లల్లో చదివే అలవాటు పెంపొందించడం
- పాఠశాల వయస్సు పిల్లలను గ్రంథాలయాలకు వచ్చేలా అలవాటు చేయడం

సమ్మర్ క్యాంప్‌లో..

సమ్మర్ క్యాంప్‌కి సెబంధించి 10 నుంచి 15 ఏళ్ల మధ్య వయస్సు గల 6 నుంచి 10వ తరగతి చదివే విద్యార్థులను అనుమతిస్తారు. ఆసక్తి గల పిల్లల తల్లిదండ్రుల అంగీకారంతో తగు జాగ్రత్తలు పాటిస్తూ పాఠశాల విద్యార్థులను అనుమతిస్తారు.



ఈ శిబిరాలతో విద్యార్థులకు ఎంతో మేలు..

ఈ నెల 28 నుంచి జూన్ 6 వరకు నిర్వహించనున్న వేసవి శిబిరాలు విద్యార్థులకు ఎంతో దోహదపడనున్నాయి. పిల్లలు ఈ వేసవి సెలవుల్లో మంచి అలవాట్లు పెంపొందించుకునేందుకు మంచి అవకాశం. ఇప్పటి నుంచే గ్రంథాలయాలకు వెళ్లడం నేర్పితే భవిష్యత్ ఎంతో బాగుంటుంది. ముఖ్యంగా యువత చెడు మార్గాలకు వెళ్లకుండా ఈ వేసవి శిబిరాలు ఎంతో ఉపయుక్తంగా ఉంటాయి.

– ఆర్‌సీహెచ్ వెంకట్రావు, కార్యదర్శి, జిల్లా గ్రంథాలయ సంస్థ, విశాఖపట్నం

నేచర్ క్యూర్ ఆస్పత్రిలో 'మన్ కీ బాత్'



కార్యక్రమంలో పాల్గొన్న నేచర్ క్యూర్ ఆస్పత్రి ప్రతినిధులు

దాబాగార్డెన్స్: మనసులో మాట పేరిట ప్రతి నెలా చివరి ఆదివారం నిర్వహించే 'మన్ కీ బాత్' కార్యక్రమం మహారాణిపేటలో గల నేచర్ క్యూర్ ఆస్పత్రిలో జరిపారు. ఏపీ బీజేపీ మెడికల్ సెల్ కన్వీనర్ రూపాకుల రవికుమార్ నేతృత్వంలో ఈ కార్యక్రమం వీక్షించారు. పెహల్గాం ఉగ్రదాడిని మోదీ తీవ్రంగా ఖండించారన్నారు. జమ్మూ కాశ్మీర్ అద్భుతంగా పురోగతి సాధించడాన్ని చూసి ఓర్వలేక ఉగ్రవాదులు దెబ్బ తీసేందుకు ఇటువంటి చర్యలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. మోదీ ప్రసంగం అనంతరం రవికుమార్ మాట్లాడుతూ ప్రతి భారతీయుడు ఈ దాడిని మరువలేకపోతున్నారని చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ ఎస్. లక్ష్మీనారాయణ, శ్రీనివాస్, ఎస్. శ్రీలక్ష్మి, శంకరరావు, సాయి పూజిత, రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యతో పాటు రీసెర్చ్‌కు ప్రాధాన్యం



మాట్లాడుతున్న ప్రొఫెసర్ ఆదిత్య

సీతమ్మధార: విద్యతో పాటు రీసెర్చ్‌కు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని మహీంద్రా యూనివర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్ ఆదిత్య అబ్బూరి తెలిపారు. నగరంలోని ఒక హోటల్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇది రీసెర్చ్ బేస్డ్ యూనివర్సిటీ అన్నారు. బీటెక్ విద్యార్థులు ఎంటెక్, పీహెచ్‌డీ వాళ్లతో కలిసి హై ఎండ్ ల్యాబ్స్‌లో పని చేసే అవకాశం కల్పిస్తున్నామని చెప్పారు. రెండు సూపర్ కంప్యూటర్స్ ఉన్నాయన్నారు. ఇప్పుడు ట్రెండ్ అంతా ఆటోమేషన్ వైపు నడుస్తుందన్నారు. ప్రస్తుతం చైనా నుంచి దిగుమతి జరుగుతుందన్నారు. ఫోర్ వీలర్స్ బ్యాటరీస్ అన్నీ దిగుమతి అవుతున్నాయని చెప్పారు.

క్లుప్తంగా

కుటుంబం చెంతకు ఉతరప్రదేశ్ మహిళ

సీతమ్మధార: ఉత్తరప్రదేశ్‌లోని బంద జిల్లాకు చెందిన దౌన్సార్ గ్రామ నివాసి షియాపతి (36)కు ఒక కొడుకు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ప్రస్తుతం ఆరు నెలల గర్భవతిగా ఉంది. భార్యాభర్తల మధ్య గొడవతో మనస్థాపానికి గురై నాలుగు నెలల క్రితం ఇల్లు వదిలేసి వచ్చింది. వైజాగ్ రైల్వేస్టేషన్‌లో ఆమె తిరుగుతుండగా ఏయూటీడీ సిబ్బంది గుర్తించి మహిళా షెల్టర్ హోంలో ఆశ్రయం కల్పించారు. ఆమె భర్త, చౌకీదార్ అయిన రాంప్రసాద్‌కు ఫోన్ చేసి షియా ఆరు నెలల గర్భవతి అని చెప్పి అతన్ని ఒప్పించి శ్రద్ధా బృందం సహాయంతో వైజాగ్ నుంచి తీసుకెళ్లి అతనికి అప్పగించారు. శ్రద్ధా సోషల్ వర్కర్లు నీలం, వీణ షియా దంపతులు ఇద్దరికీ కౌన్సెలింగ్ చేశారు. రెండు నెలలకు సరిపడా మందులిచ్చి వచ్చినట్లు తెలిపారు.

ఎర్నిమాంబకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో ఎర్నిమాంబ అమ్మవారు

కంచరపాలెం: కాన్వెంటు కూడలిలో వెలసిన ఎర్నిమాంబ అమ్మవారి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఈవో డీవీఎస్ సురేష్‌బాబా నేతృత్వంలో ఆలయ అర్చకులు పులఖండం శ్రీకాంత్ శర్మ ఉదయం నుంచి అమ్మవారికి కుంకుమ పూజలు, విశేషార్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పూజారి వాసుపల్లి విజయమ్మ అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు. భక్తులకు ప్రత్యేక ఉచిత దర్శనాలతో పాటు రూ.10, రూ.50 ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. భక్తుల మౌలిక వసతులపై ఈవో సురేష్‌బాబా ప్రత్యే చర్యలు చేపట్టారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. ఎర్నిమాంబ ఆలయ కమిటీ చైర్మన్ లండా రమణ, సిబ్బంది రామకృష్ణ, ప్రసాద్, ట్రస్టు సభ్యులు, స్వచ్ఛంద సంస్థ సభ్యులు భక్తుల సౌకర్యాలను పర్యవేక్షించారు.

రక్తదాన శిబిరానికి చక్కటి స్పందన



శిబిరంలో రక్తదానం చేస్తున్న సంత్ నిరంకారీ సభ్యులు

దాబాగార్డెన్స్: మహారాణిపేటలోని సంత్ నిరంకారి చారిటబుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఫౌండేషన్ విశాఖ అధ్యక్షుడు ప్రేమ్ రాంచంద్ మీర్పూరి ప్రారంభించారు. విశాఖతో పాటు విజయనగరం, అనకాపల్లి జిల్లాల్లో సంత్ నిరంకారి సంస్థల సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొని రక్తదానం చేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు, రెడ్‌క్రాస్ సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

రైల్వే ప్రయాణికులకు అవగాహన



టికెట్లు తనిఖీ చేస్తున్న కమర్షియల్ సిబ్బంది

తాటిచెట్లపాలెం: రైలు ప్రయాణికుల భద్రత, సౌకర్యం దృష్ట్యా వాల్తేర్ డివిజన్ కమర్షియల్ సిబ్బంది ప్రత్యేక టికెట్ తనిఖీ డ్రైవ్‌లు చేపడుతున్నారు. విశాఖ రైల్వే స్టేషన్‌లో ఆదివారం టికెట్ తనిఖీలు నిర్వహించారు. సరైన టికెట్ లేకుండా రిజర్వేషన్ బోగీల్లో ప్రయాణించే వారికి, దివ్యాంగ కోచ్‌ల్లో ప్రయాణించే సాధారణ ప్రయాణికులకు అవగాహన కల్పించారు. సరైన టికెట్‌తో, సరైన రైలులో సుఖ ప్రయాణం సాగించాలని ప్రయాణికులకు సూచించారు. రద్దీగా ఉన్న బోగీల్లో ప్రయాణించడం వల్ల దొంగతనాలు, జరిగే అవకాశాలు ఉంటాయని, ఫుట్‌బోర్డుపై ప్రయాణం ప్రమాదకరమని హెచ్చరించారు.

ఆకట్టుకున్న సంగీత విభావరి

సీతంపేట: నారీ భేరి, శక్తి ఎంపవరింగ్ ఉమెన్ అసోసియేషన్, ఎంవీపీ స్వర సంగమం సంయుక్తంగా ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో నిర్వహించిన సినీ సంగీత విభావరి ఆకట్టుకుంది. నగరానికి చెందిన గాయనీ గాయకులు సి.వి.రాజేశ్వరి, కె.భాగ్యలక్ష్మి, పద్మిని, రజిని, పుండరీ కుమార్, పెమ్మరాజు రామనర్సింహం, నాయుడు, స్వామి, ఉమాశంకర్, చింతా సుధీర్, బాబ్జి, వి.వి.చారి, భవ్య, కాశ్యప్ తమ గీతాలతో అలరించారు. కార్యక్రమంలో కళా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

మహిళను విధుల్లోకి తీసుకోవాలి



మాట్లాడుతున్న బాధిత యువతి

సీతమ్మధార: అచ్యుతాపురంలోని బ్రాండిక్స్ కంపెనీలో సీఈవో (శ్రీలంక జాతీయుడు)గా పని చేసిన దిలీప్ పింటోపై చర్యలు తీసుకుని, బాధిత మహిళకు న్యాయం చేయాలని నేషనల్ యునైటెడ్ ఫ్రంట్ జాతీయ ఉపాధ్యక్షుడు డాక్టర్ అనిల్ కుమార్, రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా జాతీయ నాయకుడు దౌలత్ రామ్ విజ్ఞప్తి చేశారు. ఆదివారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద మీడియా సమావేశం నిర్వహించారు. బ్రాండిక్స్‌లో పని చేస్తున్న ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రానికి చెందిన మహిళపై దిలీప్ పింటో లైంగికదాడి చేశాడని ఆరోపించారు. ఆ విషయాన్ని బాధితురాలు ఫిర్యాదు చేసినందున లైంగిక దాడి చేసిన వ్యక్తి జనరల్ మేనేజర్ హోదాలో ఉండడంతో ఆమెను తొలగించాడన్నారు. ఆమెకు జరిగిన అన్యాయంపై ఎంత మందికి ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయిందని వాపోయారు. చివరికి షెడ్యూల్ కులాల జాతీయ కమిషన్‌కు ఫిర్యాదు చేయగా, వారు విచారించి ఎస్సీ, ఎస్టీ సెక్షన్ల కింద కేసు నమోదు చేయమని పోలీసులను ఆదేశించారని తెలిపారు. దాదాపు రూ.30 లక్షల పరిహారం చెల్లించాల్సి ఉంటే కేవలం రూ. 3 లక్షలు చెల్లించి చేతులు దులుపుకున్నారన్నారు. అదే విధంగా ఉద్యోగానికి సంబంధించి జిల్లా ఉపాధి కల్పనాధికారికి పంపించి చేతులు దులుపుకున్నారని చెప్పారు. ఈ రకంగా గత పది సంవత్సరాలుగా తీవ్రమైన అన్యాయానికి ఆమె గురైనట్లు తెలిపారు. ఆమెకు మద్దతుగా ధర్నా చేస్తున్నామని, విద్యార్థులు, మేధావులు, ఉద్యోగులు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎం .వెంకటేశ్వర్లు, ఎం. లక్ష్మి, కళ్యాణ్‌రావు, చిన్నారావు, రాజేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ కార్యవర్గం ఎన్నిక



నూతనంగా ఎన్నికైన చిన్న, మధ్య తరహా పత్రికా సంపాదకుల అసోసియేషన్ సభ్యులు

అల్లిపురం: జాతీయ చిన్న, మధ్య తరహా పత్రికా సంపాదకుల అసోసియేషన్ జాతీయ కార్యవర్గ ఎన్నిక ఆదివారం రాజస్థాన్ రాష్ట్రం, జైపూర్‌లో జరిగింది. ఇందిరాగాంధీ పంచాయతీ రాజ్ సమస్థాన్ ఆడిటోరియంలో జరిగిన సమావేశంలో అసోసియేషన్ జాతీయ కార్యవర్గం నూతన అధ్యక్షుడిగా కేడీ చెందోల్ (ఉత్తర ప్రదేశ్), ప్రధాన కార్యదర్శిగా శంకర్ కతీర (గుజరాత్), ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సీనియర్ జర్నలిస్ట్ జాతీయ కార్యవర్గ సభ్యునిగా కొయిలాడ పరశురాం, వెంకటరెడ్డితో పాటు ఏపీ అధ్యక్షుడిగా నందిరెడ్డి కొండలరావు, కమల్‌కుమార్ తిరిగి ఎన్నుకున్నారు. వరుసగా నాలుగోసారి కొయిలాడ పరశురాం ఎన్నికవ్వడంతో ఆయనను పలువురు పత్రికా సంపాదకులు అభినందించారు.

'వక్ఫ్ సవరణ చట్టాన్ని ఖండిస్తున్నాం'



మాట్లాడుతున్న రహ్మతుల్లా బేగ్

దాబాగార్డెన్స్: ముస్లింలపై దాడులు చేస్తూ, ముస్లింల ఆస్తులు కొట్టేయాలన్న కుట్రతో కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ సవరణ చట్టం–2025 బిల్లు ప్రవేశపెట్టిందని, ఈ బిల్లును తాము పూర్తిగా ఖండిస్తున్నామని రాజ్యాంగ పరిరక్షణ కమిటీ ప్రతినిధి రహ్మతుల్లా బేగ్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడారు. వక్ఫ్ ఆస్తులన్నీ ముస్లిం దాతలు ఎప్పుడో తమ అభీష్టం మేరకు, ముస్లిం సమాజం కోసం త్యాగం చేసి దానం చేసిన ఆస్తులే కానీ ప్రభుత్వానికి సంబంధించినవి కావని స్పష్టం చేశారు. వక్ఫ్ అంటే అల్లాహ్ పేరిట అర్పించడమేనన్నారు. ప్రముఖ న్యాయవాది షరీఫ్ మాట్లాడుతూ ముస్లింల సంక్షేమానికి దానం చేయబడిన ఆస్తి, భూమి, భవనం, నగదు, నగలు ఏవైనా సరే అల్లాహ్ పేరిట దానమిచ్చారని, ఆ ఆశయాన్ని నిర్వహించేందుకు ఎవరిపై ఆధారపడకుండా ఆస్తిని కాపాడే సంరక్షణ సంస్థగా, అలనాటి ప్రభుత్వాలు సెంట్రల్ వక్ఫ్ కౌన్సిల్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వాలు సంరక్షించేందుకు రాష్ట్ర వక్ఫ్ బోర్డు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 1956లో అలనాటి ప్రభుత్వాలు ముస్లిం, ముస్లిమేతర భూములు, రెవెన్యూ, ఫారెస్ట్ తదితర భూములను ఇనాంల ద్వారా సంతరించిన, అన్ని భూములు పోగా, మిగులు భూములు ప్రభుత్వ భూములుగా సృష్టించబడ్డాయన్నారు. రాష్ట్రంలో సుమారు 3500 వక్ఫ్ సంస్థలు మసీదు, బరియల్‌గ్రౌండ్స్, పంజాలు, అషూర్, ఖానాలు, లంగర్‌ఖానాలు తదితర వాటి ఆస్తులు వక్ఫ్ ఆస్తులుగా, సుమారు 65 వేల ఎకరాలుగా నమోదై ఉన్నాయన్నారు. ఆ భూములను కేంద్ర ప్రభుత్వం, సెంట్రల్ వక్ఫ్ బోర్డు నిర్ధారించడం జరిగిందన్నారు. సమావేశంలో అహ్మతుల్లా ఖాన్, షేరు, బషీర్, షరీఫ్, మునీర్‌ఖాన్, నూర్ అహ్మద్, షేక్ బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

బహుజనులు ఐక్యం కావాలి



మాట్లాడుతున్న విశ్రాంత ఆచార్యులు కేఎస్ చలం

అల్లిపురం: బహుజనులు ఐక్యమై డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయాలైన కుల నిర్మూలన స్టేట్ సోషలిజం సాధించాలని విశ్రాంత ఆచార్యులు కేఎస్ చలం అన్నారు. ఆదివారం నగరంలో ఒక హోటల్‌లో జరిగిన భారతీయ అంబేద్కర్ సేన రాష్ట్ర ప్రతినిధుల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన భారతీయ అంబేద్కర్ సేన ముసాయిదా ప్రణాళికను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భారతదేశ చరిత్ర, ఆర్థిక అంశాలను సోదాహరణగా విశ్లేషించారు. కార్యక్రమంలో అంబేడ్కర్ సేన వ్యవస్థాపకులు పీటీఎం శివప్రసాద్, దుర్గం సుబ్బారావు, బాస్ రాష్ట్ర అధ్యక్షుడు యు. గణపతి, రాష్ట్ర కమిటీ నాయకులు పాలకుంట శ్రీనివాసులు, పల్లం తాతయ్య, ముత్యాల మోహన్, మోహన్‌రాజు, పూలతోట కృష్ణ, సీరుగొట్టి రమణ, ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.

గిన్నిస్ రికార్డ్ సాధించిన పాస్టర్ దంపతులు



గిన్నిస్ బుక్‌తో అభినందిస్తున్న ప్రతినిధులు

అల్లిపురం: రామ్‌నగర్‌కు చెందిన పాస్టర్ ఎస్.జయపాల్, జ్యోతి వినయకుమారి దంపతులు గత ఏడాది డిసెంబర్ 1వ తేదీన హార్లెల్ మ్యూజిక్ స్కూల్ నిర్వహించిన ఆన్‌లైన్ బృంద సంగీత ప్రదర్శనలో గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు సాధించారు. హెచ్.ఎం.ఎస్. వ్యవస్థాపకులు అయిన ఆగస్టిస్ దండంగి శిక్షణలో 18 దేశాల నుంచి 1090 మంది కీబోర్డు ప్లే చేసి ఇన్‌స్టాగామ్‌లో అప్లోడ్ చేశారు. ఈ వీడియో ప్రపంచ రికార్డు సాధించడంతో అందులో పాల్గొన్న 1046 మందికి ఏప్రిల్ 14న హైదరాబాద్ మణికొండ లైఫ్ చర్చిలో ధ్రువ పత్రాలు పంపిణీ చేశారు. ప్రపంచ రికార్డు నెలకొల్పిన ఈ దంపతులను గిన్నిస్ ప్రతినిధులు బ్రదర్ అనిల్‌కుమార్, ఆనంద రాజన్ అగస్టిన్ సత్కరించారు.

ఘనంగా డాక్టర్ హానిమన్ జయంతి



డాక్టర్ హానిమన్‌కు నివాళులు అర్పిస్తున్న హోమియో వైద్యులు

అల్లిపురం: హోమియో సృష్టికర్త డాక్టర్ హానిమన్ 270వ జయంతి ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హోమియోపతిక్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇనిస్టిట్యూట్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కె. శివమూర్తి హానిమన్ చిత్రటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హోమియో వైద్య శాస్త్రంలో ఎండీ కోర్సు తర్వాత డీఎం కోర్సును అన్ని హోమియో కళాశాలల్లో ప్రవేశపెట్టనున్నారని తెలిపారు. జాతీయ ఉపాధ్యక్షుడు డాక్టర్ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ విశాఖ జిల్లా శాఖ సేవలను విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలకు కూడా విస్తృతం చేయాలన్నారు. విశాఖజిల్లా అధ్యక్షుడు డాక్టర్ పి.రాఘవేంద్రరావు మాట్లాడుతూ రెండు సంవత్సరాల నుంచి చేపట్టిన వైద్య విజ్ఞాన సెమినార్లు, మెడికల్ క్యాంపుల గురించి ప్రస్తావించారు. కార్యక్రమంలో సంస్థకు చెందిన హోమియో డాక్టర్లు శివమూర్తి, సుబ్బారావు, నరేంద్రనాథ్, ఎండీవీ రమణారావు, ప్రభాకర్‌మూర్తి, కె. శర్మ, సతీష్‌లను సత్కరించారు.

పోప్ ఫ్రాన్సిస్‌కు ఘన నివాళి



ర్యాలీలో పాల్గొన్న ఫాదర్ జొన్నాడ జాన్‌ప్రకాష్, క్రైస్తవులు

కంచరపాలెం: ఇటీవల మరణించిన ప్రపంచ రోమన్ క్యాథలిక్ సంఘ కాపరి, శాంతిదూత పోప్ ఫ్రాన్సిస్ ఆత్మ శాంతికి ఆదివారం సాయంత్రం జ్ఞానాపురంలోని సెయింట్ పీటర్స్ రక్షణగిరి ముఖద్వారం వద్ద కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. చర్చి విచారణ గురువులు రెవరెండ్ ఫాదర్ జొన్నాడ జాన్ ప్రకాష్, పారిస్ పాస్టిల్ కౌన్సిల్ (పీపీసీ) నేతృత్వంలో పోప్ ఫ్రాన్సిస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఫాదర్ జాన్‌ప్రకాశ్ మాట్లాడుతూ విశ్వ క్యాథలిక్ సంఘ కాపరి, యావత్ క్రైస్తవ లోకానికి మార్గ చూపరి, దైవ సేవకుడు అయిన పోప్ ఫ్రాన్సిస్ మరణం క్రైస్తవ లోకానికి తీరని లోటు అని పేర్కొన్నారు. ప్రపంచం ఒక గొప్ప శాంతి దూతను కోల్పోయిందన్నారు. ఆయన ఆత్మకు దేవుడు నిత్య విశ్రాంతినీయాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో విచారణకర్తలు ఫాదర్ వినయ్ కుమార్, ఫాదర్ ఆంథోనీ రాజ్, పీపీసీ అధ్యక్షుడు శ్రీముసురు రాజేష్, మీసాల స్వర్ణలత, సైమన్ జోసెఫ్, పాలమరశెట్టి ఫ్రాన్సిస్ తదితరులు పాల్గొన్నారు.


కాలభైరవ స్వామికి ఘనంగా పూజలు



వడమాలలో కాలభైరవుడు

సీతమ్మధార: జీవీఎంసీ 14వ వార్డులోని శ్రీ మహాగణపతి, ప్రసన్న వేంకటేశ్వరస్వామి, అయ్యప్ప, షిర్డీ సాయిబాబా దేవస్థానంలో ఆదివారం మహాలక్ష్మి దుర్గమ్మ వారికి, కాలభైరవ స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమావాస్య కావడంతో కాలభైరవ స్వామికి ఈ పూజలు జరిపారు. భక్తులు తెచ్చిన వడమాలలను స్వామి వారికి అలంకరించారు. భక్తులు గుమ్మడికాయల్లో నెయ్యిదీపాలు వెలిగించి పూజలు చేశారు. దేవస్థానం అధికారుల పర్యవేక్షణలో ప్రధాన అర్చకుడు రాజాస్వామి ఆధ్వర్యంలో పంచామృతాభిషేకం, క్షీరాభిషేకరం జరిపారు. భక్తులు గోత్రనామాలతో పూజలు చేయించుకున్నారు. అంతకు ముందు గణపతి మహాస్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. ఈ పూజా కార్యక్రమాల సందర్భంగా దేవస్థానం పరిసరాల్లో సందడి వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో దేవస్థానం సిబ్బంది శివ, అధిక సంఖ్యలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ముస్లిం వివాహ పరిచయ వేదికకు అనూహ్య స్పందన



మాట్లాడుతున్న హైదర్ అలీ సింకా

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 42వ వార్డు టీఎస్ఎన్ కాలనీలో గల హోటల్ సింకా గ్రాండ్‌లో ఆదివారం ముస్లిం వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ముస్లిం ఉచిత వివాహ పరిచయ వేదిక నిర్వహించారు. పెద్ద ఎత్తున ముస్లింలు హాజరయ్యారు. వారి అర్హతలను బట్టి తమ పిల్లలకు తగిన సంబంధాలను ఎంపిక చేసుకున్నారు. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్షుడు హైదర్ అలీ సింకా మాట్లాడుతూ తమ సొసైటీ ఆధ్వర్యంలో ఇప్పటి వరకు 8 సార్లు ఉచిత వివాహ పరిచయ వేదిక కార్యక్రమం ఏర్పాటు చేసామని, ఇప్పటి వరకు సుమారు 250 మంది వివాహాలు చేసుకుని ఒక్కటయ్యారని తెలిపారు. ఇది పూర్తిగా ఉచిత సేవ అని తెలిపారు. పేద ముస్లింలకు తమ సొసైటీ తరఫున షాదీ ఖర్చులు కూడా భరించి, ఉచితంగా వివాహాలు జరిపిస్తున్నామని సింకా తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ వైస్ ప్రెసిడెంట్ హాజీ మీర్ అబ్బాస్ హుసేన్, హమీద్‌ఖాన్, కార్యదర్శి హాజీ సయ్యద్ అమీర్‌జాన్, సహాయ కార్యదర్శి మహబూబ్ షరీఫ్, మహబూబ్ ఆలీఖాన్, షేక్ అహ్మద్ వలీ, షేక్ అబ్దుల్ మునీర్, రహమతుల్లా, సొసైటీ సభ్యులు అబ్దుల్ మునీర్, మొహమ్మద్ లుక్మన్, మునీర్‌ఖాన్, ముషీద్, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ముస్లిం కుటుంబాలు పాల్గొన్నాయి.

జాగ్రత్తలతో నేత్ర సంరక్షణ



నేత్ర వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

మురళీనగర్: సెల్‌ఫోన్లు, టీవీలు ఎక్కువగా చూడటం వల్ల, వాటి నుంచి వెలువడే లైటింగ్ కంట్లోకి ప్రవేశించి రెటీనాకు నష్టం కలిగిస్తుందని డాక్టర్ రుషిక అన్నారు. మురళీనగర్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం వాకర్స్ పార్కులో మ్యాక్స్ విజన్ ఆస్పత్రి, ఏఐఎన్‌యూ ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నెఫ్రాలజీ అండ్ యూరాలజీ సహకారంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేత్ర సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. శిబిరంలో 109 మంది స్థానికులకు ఉచిత నేత్ర వైద్య పరీక్షలు చేశారు. డాక్టర్ హేమని, డాక్టర్ యామిని ఆధ్వర్యంలో జనరల్ పరీక్షలు నిర్వహించారు. 124 మందికి బీపీ, సుగర్ పరీక్షలు చేశారు. వాకర్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు సనపల భానుప్రకాష్, సిహెచ్.ప్రసాదరావు, పూర్వ అధ్యక్షులు ఎ.రామకృష్ణారెడ్డి, ఎన్. బుచ్చయ్య, సంయుక్త కార్యదర్శి ఎస్.ప్రకాశరావు, కోశాధికారి ఆర్.నాగేశ్వరరావు, ఇతర కార్యవర్గ సభ్యులు శిబిరం నిర్వహణకు సహకరించారు.